# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in  ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం  తెలుగు దిన పత్రిక


సంపుటి : 02  సంచిక : 113  కృష్ణా, ఆదివారం 17 - 01 - 2026  పేజీలు : 4  వెల. 2 /-








## ఎంత ఎత్తుకు ఎదిగినా మూలాలను మరచిపోవద్దు: సీఎం చంద్రబాబు



**క్రైం కౌంటర్ న్యూస్,** కాకినాడ జిల్లా, జనవరి 17: ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు శనివారం కాకినాడలో ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ అమోనియా పరిశ్రమకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ఇంధన రంగంలో ఇదో చారిత్రక మైలురాయిగా నిలవనుందని చెప్పారు. రాష్ట్రాన్ని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా తయారు చేస్తామని తెలిపారు. రానున్న రోజుల్లో ప్రపంచం మొత్తం కాకినాడ వైపు చూస్తుందని తెలిపారు. మన సంస్కృతిని కాపాడుకుంటూ టెక్నాలజీని వాడుకోవాలని సూచించారు. మనం ఎంత ఎత్తుకు ఎదిగినా మూలాలను మరచిపోవద్దని చెప్పారు. ఆనాడు నాగార్జున ఫెర్టిలైజర్స్ (చీఫీజా) ఏర్పాటులో దివంగత ఎన్టీఆర్ ఎంతో చొరవ చూపారని.. గ్రీన్ అమ్మోనియా భవిష్యత్‌లో పెను మార్పునకు నాంది పలుకుతుందని తెలిపారు. ఇక్కడి నుండి ఉత్పత్తి అయ్యే గ్రీన్ అమ్మోనియాను జర్మనీ, జపాన్, సింగపూర్ వంటి దేశాలకు ఎగుమతి చేయనున్నారని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. తద్వారా భారత్ ఒక గొప్ప ఇంధన ఎగుమతిదారుగా ఎదుగుతుందన్నారు. బొగ్గు వినియోగంతో పర్యావరణం దెబ్బతినడమే కాకుండా ప్రాణాలకు ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. ఎరువులు, పురుగు మందుల వినియోగం బాగా తగ్గించాలని, గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి పెంచాలని ప్రధాని మోదీ కోరుతున్నట్లు గుర్తు చేశారు. 2014లో తమ ప్రభుత్వం గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియాకు నాంది పలికిందని.. సన్ రైజ్ ఆంధ్రప్రదేశ్‌లో 20 పోర్టులు వస్తున్నాయని చెప్పారు. 2027 జూన్ నాటికి మొదటి ఉత్పత్తి ప్రారంభం అవుతుందని సీఎం చంద్రబాబు తెలిపారు. గ్రీన్ అమ్మోనియా పరిశ్రమ ఒక రకంగా చెప్పాలంటే ఏపీకి గేమ్ చేంజర్ అవుతుందన్నారు. సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజీ.. మన రాష్ట్రానికి వరం వంటివని చెప్పారు. ఏపీలో పరిశ్రమలు పెట్టుకోవడానికి అనుకూలమైన ప్రాంతాలు ఎన్నో ఉన్నాయని.. 2047 నాటికి మన రాష్ట్రం స్వర్ణాంధ్రగా తయారవుతుందని తెలిపారు. ఈ పరిశ్రమ వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా 2,600 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## మాజీ ఎంపీ విజయసాయి రెడ్డికి ఈడీ నోటీసులు

**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 17,**మాజీ ఎంపీ విజయసాయి రెడ్డికి భారీ షాక్ తగిలింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ హైదరాబాద్ విభాగం ఆయనకు నోటీసులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో విజయసాయి రెడ్డిని విచారణకు హాజరు కావాల్సిందిగా ఆదేశించింది. జనవరి 22న ఈడీ ముందు హాజరు కావాలని ఆదేశాలు జారీ చేసింది. 2019 నుండి 2024 మధ్య ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేసిన మద్యం విధానంపై దర్యాప్తులో భాగంగా విజయసాయి రెడ్డిని ప్రశ్నించనున్నట్లు ఈడీ వర్గాలు తెలిపాయి. మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద ఈ దర్యాప్తు జరుగుతోంది. ఏపీ లిక్కర్ స్కామ్‌లో భారీగా లంచాలు తీసుకోవడం, నిధులు మళ్లించడం వంటి ఆరోపణలు ప్రధానంగా వినిపిస్తున్నాయి. మద్యం కేసులో ఇప్పటికే పలువురు ప్రముఖులను విచారించగా.. తాజాగా విజయసాయి రెడ్డికి నోటీసులు జారీ కావడం సంచలనంగా మారింది. ఈ కేసును ఆంధ్రప్రదేశ్ పోలీసుల ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కూడా విచారిస్తోంది. సిట్ ప్రకారం, గత వైసీపీ ప్రభుత్వం కొత్త మద్యం విధానం ద్వారా సరఫరాదారుల నుండి 15 నుంచి 20 శాతం వరకు లంచాలు వసూలు చేసిందని ఆరోపణలున్నాయి. లంచాలు ఇవ్వడానికి నిరాకరించిన ప్రముఖ మద్యం బ్రాండ్‌లను పక్కన పెట్టారని కూడా సిట్ తెలిపింది. తదర్యాప్తు అధికారులు చెప్పిన దాని ప్రకారం, ఆటోమేటిక్ కొనుగోలు వ్యవస్థను తీసివేసి, మాన్యువల్ అనుమతులకు మార్చారు. దీనివల్ల సరఫరా ఆర్డర్లలో అవకతవకలు జరిగాయని ఆరోపణలున్నాయి. నకిలీ డిస్టిలరీలను ఏర్పాటు చేసి, ఎక్కువ మొత్తంలో సరఫరా ఆర్డర్లు పొంది, నకిలీ లావాదేవీల ద్వారా నిధులను మళ్లించారని కూడా ఆరోపణలున్నాయి. ఈడీ ఆరోపణల ప్రకారం, అర్హత ప్రమాణాలను మార్చి, సరఫరాదారులను లంచాలు ఇవ్వాలని బలవంతం చేశారు. నకిలీ విక్రేతల చెల్లింపులు, అధిక ధరల బిల్లులు, నకిలీ కంపెనీల ద్వారా లంచాలు సేకరించి, ఎన్నికల కోసం, వ్యక్తిగత లాభాల కోసం విదేశాలకు తరలించారని ఈడీ ఆరోపించింది. ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్బీసీఎల్)



మద్యం సరఫరాదారులకు చెల్లించిన మొత్తంలో కొంత భాగాన్ని, వస్తువులు, సేవల కోసం చెల్లింపుల మాటున వివిధ కంపెనీలకు మళ్లించారని ఈడీ ఆరోపిస్తోంది. ఇలాంటి అనేక నకిలీవి, అధిక ధరలతో లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. కొన్ని సందర్భాల్లో, నగదు, బంగారం కొనుగోలు చేయడానికి ఈ నిధులను నగల వ్యాపారులకు మళ్లించి, ఆ తర్వాత వాటిని నిందితులకు అప్పగించారని కూడా దర్యాప్తు అధికారులు ఆరోపించారు.

2019 నుండి 2024 మధ్యకాలంలో 16 మద్యం కంపెనీలు ఏపీఎస్బీసీఎల్ నుండి సరఫరా ఆర్డర్లు పొందడానికి లంచాలు చెల్లించాయని సిట్ దర్యప్తులో వెల్లడైంది. ఈ కాంట్రాక్టుల విలువ రూ.10,835 కోట్లుగా తేల్చింది. గత వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన రూ.23,000 కోట్ల సరఫరా ఆర్డర్లలో ఇవి భాగం అని గుర్తించారు. లంచాల రూపంలో రూ.3,500 కోట్లకు పైగా నిధులు అనేక లావాదేవీల ద్వారా మళ్లించబడ్డాయని సిట్ అంచనా వేసింది.

## నిబంధనలకు విరుద్ధంగా.. రూ.వందల్లో వసూలు



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 17,**అహోబిలం ఆలయంలో పార్వేటోత్సవం ఘనంగా ప్రారంభమైంది. ఈ వేడుకలో పాల్గొనడానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. ఈ క్రమంలో భక్తుల రద్దీని ఆసరాగా చేసుకుని టోల్‌గేట్ నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా, ఇష్టారాజ్యంగా అధిక మొత్తంలో టోల్ ఫీజు వసూలు చేస్తూ భక్తులను ఇబ్బంది పెడుతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్రమంగా వసూలు చేస్తున్న అధిక టోల్ ఫీజు గురించి ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

శుక్రవారం అహోబిలంలో పార్వేటోత్సవం ప్రారంభమైంది. స్వామివారు తన వివాహానికి ప్రజలను ఆహ్వానించడానికి గ్రామాలకు బయలుదేరారు. ఈ కార్యక్రమాన్ని చూడటానికి కర్నూలు జిల్లాతో పాటు తమిళనాడు వంటి ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. దీంతో అహోబిలం పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. చాలామంది భక్తులు తమ వ్యక్తిగత వాహనాల్లో వచ్చారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని టోల్‌గేట్ నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నారు.

సాధారణంగా పంచాయతీ నిర్ణయించిన ప్రకారం ఆటోకు రూ.75, కారుకు రూ.100, లారీ లేదా బస్సుకు రూ.150 టోల్ ఫీజు వసూలు చేయాలి. కానీ సిబ్బంది మాత్రం తమకు నచ్చినంత వసూలు చేస్తూ భక్తులను వేధిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం పార్వేటోత్సవానికి హాజరైన భక్తుల కార్లకు రూ.200 చొప్పున టోల్ ఫీజు వసూలు చేశారు. ఇదేమని ప్రశ్నిస్తే నిర్వాహకులు సరిగా సమాధానం చెప్పడం లేదు.


వాహనదారులకు ఇచ్చే రసీదులపై పంచాయతీ ముద్రలు కూడా లేవు. ఏ వాహనానికి ఎంత రుసుము ఉంటుందో తెలిపే ధరల బోర్డును కూడా అక్కడ ఏర్పాటు చేయలేదు. దీంతో నిర్వాహకులు అడిగినంత డబ్బులు భక్తులు చెల్లించాల్సి వస్తోంది. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ, "ఈ విషయం మా దృష్టికి రాలేదు. పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు. ఈ అక్రమ వసూళ్లపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి టోల్ ఫీజుల గురించి భక్తులకు సరైన సమాచారం ఇచ్చి, ఈ దోపిడీకి అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

## హరిత ఇంధన ఎగుమతి లక్ష్యంగా పనిచేస్తున్నాం



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 17,** రాష్ట్రాన్ని దేశానికే గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా, నికర హరిత ఇంధన ఎగుమతి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ దిశగా మరో చరిత్రాత్మక ముందడుగు పడిందని ఆయన ప్రకటించారు. కాకినాడలో ఏఎం గ్రీన్ సంస్థ ఏర్పాటు చేస్తున్న 1.5 మిలియన్ టన్నుల సామర్థ్యం గల గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టు పరికరాల ఏర్పాటు కార్యక్రమం శనివారం ప్రారంభమైందని తెలిపారు. ఈ చరిత్రాత్మక కార్యక్రమంలో తాను, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పాల్గొన్నామని ముఖ్యమంత్రి తన ప్రకటనలో పేర్కొన్నారు. 2024 అక్టోబర్‌లో తమ ప్రభుత్వం ప్రారంభించిన సమీకృత క్లీన్ ఎనర్జీ పాలసీ ఫలాలను ఇస్తోందని, ఆనాడు తామిచ్చిన హామీకి అనుగుణంగా ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చడం గర్వకారణమైన మైలురాయి అని చంద్రబాబు అభివర్ణించారు. ఈ ప్రాజెక్టు కోసం ఏకంగా 10 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 83,000 కోట్లు) సమీకృత పెట్టుబడి వస్తోందని వివరించారు. ఈ పెట్టుబడిలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోనే 7.5 గిగావాట్ల సౌర, పవన విద్యుత్ సామర్థ్యం, 1 గిగావాట్ పంప్డ్ స్టోరేజ్ హైడ్రో ప్లాంట్లు కూడా ఏర్పాటవుతాయని తెలిపారు. ఇది రాష్ట్రంలో ఉన్న సమగ్రమైన క్లీన్ ఎనర్జీ వ్యవస్థకు నిదర్శనమని అన్నారు.

## అమరావతిలో పొట్టి శ్రీరాములు 58 అడుగుల విగ్రహం




**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 17,**ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని ఏపీ ప్రభుత్వం అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రచిస్తోంది. అమరావతిలో పలు ఐకానిక్ కట్టడాలు ఉండేలా చర్యలు చేపడుతోంది. అలాగే అమరావతిలో ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం, ఎయిర్‌పోర్టు, స్పోర్ట్స్ సిటీ ఇలా ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను చేపడుతోంది. వీటితో పాటుగా.. అమరావతిలో పొట్టి శ్రీరాములు, ఎన్టీఆర్ వంటి ప్రముఖుల విగ్రహాలను సైతం ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలోనే అమరావతిలో అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహావిష్కరణ ముహూర్తం ఖరారైంది. మార్చి 16వ తేదీన అమరావతిలో పొట్టి?శ్రీరాములు 58 అడుగుల విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ విషయాన్ని ఏపీ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాజేష్ వెల్లడించారు.

రాష్ట్రం కోసం అమరజీవి పొట్టిశ్రీరాములు చేసిన 58 రోజుల దీక్షకు గుర్తుగా.. రాజధానిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు డూండి రాజేష్ తెలిపారు. మార్చి 16న ఈ విగ్రహావిష్కరణ చేయనున్నట్లు తెలిపారు. మరోవైపు పశ్చిమ గోదావరి జిల్లాలోని పెనుగొండ పేరును.. వాసవీ పెనుగొండగా మార్చుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మీద సంతోషం వ్యక్తం చేశారు. మరోవైపు అమరావతిలో ఏర్పాటుచేసే పొట్టి శ్రీరాములు విగ్రహానికి 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్ అనే పేరు పెట్టారు.

అమరావతి రాజధాని ప్రాంతంలోని శాఖమూరులో 6.8 ఎకరాల విస్తీర్ణంలో పొట్టిశ్రీరాములు విగ్రహం, స్మృతి వనం ఏర్పాటు చేస్తున్నారు. మార్చి 16న పొట్టి శ్రీరాములు 125వ జయంతి కావటంతో.. అదే రోజున ఈ స్మృతివనంలో ఏర్పాటుచేసిన పొట్టి శ్రీరాములు 58 అడుగుల విగ్రహాన్ని ప్రారంభించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. విగ్రహావిష్కరణ అనంతరం పొట్టి శ్రీరాములు 125 జయంతి ఉత్సవాలను మార్చి 16 నుంచి ఏడాది పొడవునా ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనుంది. మరోవైపు పొట్టి శ్రీరాములు విగ్రహం ప్రాజెక్టును పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ సమన్వయంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. పొట్టి శ్రీరాములు విగ్రహంతో పాటుగా అమరావతిలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అయితే ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు వివిధ పార్టీల నుంచి రాజకీయ విమర్శలు వస్తున్నాయి.

## పశ్చిమగోదావరి జిల్లాలో కొత్తల్లుడికి,,,
## 1,574 రకాల వంటకాలతో బాహుబలి విందు



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 17,** తెలుగువారు ఎంతో ఘనంగా జరుపుకునే పండుగలలో అతి ముఖ్యమైంది పెద్ద పండుగ సంక్రాంతి. మూడు రోజులు జరుపుకునే ఈ పండుగకు తెలుగు లోగిళ్లు అల్లుళ్లు, కుమార్తెలు, ఇతర బంధువులతో కళకళలాడుతూ ఉంటాయి. కుమార్తెకు కొత్తగా పెళ్లయిన తర్వాత వచ్చిన మొదటి పండుగ సంక్రాంతి అయితే, ఇక ఆ ఆడబిడ్డ తల్లిదండ్రులు చేసే హంగామా మామూలుగా ఉండదు. కొత్త అల్లుడికి విందు ఏర్పాటు చేయడం కోసం రకరకాల వంటలతో కనీవినీ ఎరుగని రీతిలో ఏర్పాట్లు చేస్తారు. ఇక కొత్త అల్లుళ్లకు మర్యాద చేయడంలో గోదావరి జిల్లాల వాసుల తర్వాతే ఎవరైనా. ఇప్పటి వరకు వందల వంటకాలతో కొత్త అల్లుడికి మర్యాదలు చేసిన అత్తామామల గురించి విన్నాం. ఈ క్రమంలో కొత్త అల్లుడికి విందు ఏర్పాటులో ఓ అత్తామామలు సరికొత్త రికార్డు సృష్టించారు. ఏకంగా 1,574 వంటకాలతో విందు ఏర్పాటు చేయడం సంచలనంగా మారింది. తాజాగా పశ్చిమ గోదావరి జిల్లాలో ఓ దంపతులు కొత్త అల్లుడికి 1500కు పైగా వంటకాలతో విందు ఏర్పాటు చేసి 'నెవ్వర్ బిఫోర్ ఎవ్వర్ ఆఫ్టర్ణ అనేలా రికార్డు క్రియేట్ చేశారు. ఈ బాహుబలి విందు వివరాల్లోకి వెళ్తే.. మామిడికుదురు మండలం ఆదుర్రు గ్రామానికి చెందిన విజ్జెపు వెంకటరత్నం, సుశీల దంపతుల కుమార్తె కీర్తిశ్రీకి గతేడాది ఫిబ్రవరిలో వివాహం జరిగింది. పి.గన్నవరం మండలం, ముంగండ గ్రామానికి చెందిన సాయి శరత్‌కు ఇచ్చి శ్రీకీర్తికి వివాహం చేశారు. వీరి పెళ్లయిన తర్వాత వచ్చిన తొలి సంక్రాంతి కావడంతో, అల్లుడు సాయి శరత్‌కు భారీ స్థాయిలో విందు ఏర్పాటు చేయాలని వెంకటరత్నం దంపతులు భావించారు.

ఈ క్రమంలో సంక్రాంతి పండుగకు వచ్చిన కొత్త అల్లుడికి 1,574 రకాల ఆహార పదార్థాలతో గురువారం బాహుబలి స్థాయిలో భారీ ఏర్పాట్లు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి స్వీట్లు, పిండివంటలు, రకరకాల పండ్లు, కూల్‌డ్రింక్స్ వంటి వాటితో అల్లుడికి భారీ విందు ఇచ్చారు. ఇదే కాకుండా మొగల్తూరు పంచాయతీ నల్లంవారితోటలో కొత్త అల్లుడికి 260 వంటకాలు, ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం కైకరంలో 1,116 రకాల పిండివంటలతో అల్లుడికి విందు ఏర్పాటు చేసి ఆశ్చర్యపరిచారు. అలాగే, కొత్తగూడెం జిల్లా పాల్వంచలో కూడా కొత్త అల్లుడికి 271 రకాల వంటకాలతో విందు ఏర్పాటు చేశారు. నిజామాబాద్ జిల్లాలో 150 రకాల వంటకాలను అరిటాకుల్లో వడ్డించి అల్లుడిని ఆశ్చర్యపరిచారు.

## బంగ్లాదేశ్‌కు అస్సాం విద్యుత్ సరఫరా?':



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 17,** పొరుగు దేశం బంగ్లాదేశ్‌లో మారుతున్న రాజకీయ పరిణామాలు, హిందువులపై దాడుల నేపథ్యంలో భారత్‌లో ఆ దేశం పట్ల కొంత వ్యతిరేకత వ్యక్తం అవుతున్నప్పటికీ.. విద్యుత్ సరఫరా విషయంలో ఈశాన్య రాష్ట్రాలు కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నాయి. అస్సాం వద్ద ఉన్న మిగులు విద్యుత్తును త్రిపుర మీదుగా బంగ్లాదేశ్‌కు సరఫరా చేసేందుకు అస్సాం ప్రభుత్వం సిద్ధంగా ఉందని త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సాహా శుక్రవారం ప్రకటించారు.

ముఖ్యమంత్రుల మధ్య కీలక భేటీ అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వ శర్మ రెండు రోజుల పర్యటన నిమిత్తం గురువారం త్రిపుర చేరుకున్నారు. ఈ సందర్భంగా మాణిక్ సాహా అధికారిక నివాసంలో ఇద్దరు ముఖ్యమంత్రులు సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఈ భేటీలో తమ రాష్ట్రాల వద్ద ఉన్న అదనపు విద్యుత్తును బంగ్లాదేశ్‌కు పంపే అంశంపై హిమంత బిస్వ శర్మ సానుకూలత వ్యక్తం చేసినట్లు మాణిక్ సాహా మీడియాకు వివరించారు.

ముగియనున్న పాత ఒప్పందం.. పొడిగింపునకు మొగ్గు?

త్రిపుర రాష్ట్రం 2016 నుంచే బంగ్లాదేశ్‌కు విద్యుత్ సరఫరా చేస్తోంది. గోమతి జిల్లాలోని పలాతానాలో ఉన్న ఓఎన్‌జీసీ త్రిపుర పవర్ కంపెనీ ప్లాంట్ నుంచి తొలుత 100 మెగావాట్ల సరఫరా ప్రారంభం కాగా.. ప్రస్తుతం అది 160 మెగావాట్ల వరకు చేరుకుంది. ప్రస్తుత అవగాహన ఒప్పందం ఈ ఏడాది మార్చితో ముగియనుంది. అయితే ఈ ఒప్పందాన్ని మరింత కాలం పొడిగించే అవకాశం ఉందని, దాంతో పాటు అస్సాం విద్యుత్తును కూడా బంగ్లాకు చేరవేసే మార్గాలపై చర్చిస్తున్నామని సీఎం తెలిపారు. విద్యుత్తుతో పాటు అస్సాం-త్రిపుర రాష్ట్రాలను కలిపే జాతీయ రహదారి విస్తరణపై కూడా ఇద్దరు ముఖ్యమంత్రులు చర్చించారు. ఈ రహదారి అభివృద్ధి చెందితే ఈశాన్య రాష్ట్రాల మధ్య వాణిజ్యం, రాకపోకలు మరింత సులభతరం అవుతాయని వారు అభిప్రాయపడ్డారు.

## ఇటు ఎమ్మెల్సీ, అటు మాజీ ఎంపీకి...,వైసీపీ నేతలకు వరుస షాకులు



వైసీపీ నేత, హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యింది. అత్యాచార బాధితురాలి పేరును బయటపెట్టారంటూ గోరంట్ల మాధవ్ మీద విజయవాడ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అత్యాచారానికి గురైన బాలిక పేరును గోరంట్ల మాధవ్ బయటపెట్టారంటూ ఏపీ మహిళా కమిషన్ మాజీ ఛైర్ పర్సన్ వాసిరెడ్డ పద్మ గతంలో విజయవాడ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా విజయవాడ సైబర్ క్రైమ్ పోలీసులు గోరంట్ల మాధవ్ మీద పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ విజయవాడ పోక్సో కోర్టులో శుక్రవారం జరిగింది. ఈ విచారణకు గోరంట్ల మాధవ్ హాజరుకాలేదు. ఈ నేపథ్యంలో విజయవాడ పోక్సో కోర్టు.. గోరంట్ల మాధవ్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. అనంతరం జనవరి 30వ తేదీకి విచారణను వాయిదా వేసింది.

వైసీపీ ఎమ్మెల్సీకి షాక్..

మరోవైపు వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుకు హైకోర్టు షాక్ ఇచ్చింది. ఎమ్మెల్సీ అనంతబాబు భార్య అనంత లక్ష్మీ దుర్గకు అరెస్ట్ నుంచి రక్షణ కల్పించేలా మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరించింది. కారు డ్రైవర్, దళిత యువకుడైన సుబ్రమణ్యం హత్య కేసులో అనంతబాబు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. అయితే ఈ కేసులో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయని.. శుక్రవారం రోజున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ హైకోర్టుకు తెలియజేశారు.

ఈ కేసు ఎస్సీ, ఎస్టీ చట్టంతో ముడిపడిన కారణంగా.. బాధిత కుటుంబసభ్యులు, ఫిర్యాదుదారుకు నోటీసులు ఇవ్వాలని కోర్టును కోరారు. వారి వాదనలు వినాల్సిన అవసరం ఉందని ఏపీపీ హైకోర్టుకు తెలిపారు. ఈ నేపథ్యంలో అనంత లక్ష్మీ దుర్గ ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణలో.. సుబ్రమణ్యం తల్లికి నోటీసులు ఇచ్చింది ఏపీ హైకోర్టు. అనంతరం జనవరి 20 తేదీకి విచారణ వాయిదా వేసింది. మరోవైపు అనంతలక్ష్మీదుర్గ తరఫున వాదనలు వినిపించిన న్యాయవాది.. ఆమెకు అరెస్ట్ నుంచి రక్షణ కల్పించేలా మధ్యంతర ఉత్తర్వులివ్వాలని హైకోర్టును కోరారు. అయితే ఈ అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరించింది. అనంతబాబు కారు డ్రైవర్.. సుబ్రహ్మణ్యం హత్య కేసులో తనను అరెస్ట్ చేయకుండా.. ముందస్తు బెయిలివ్వాలంటూ అనంతబాబు భార్య అనంత లక్ష్మీదుర్గ హైకోర్టులో పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్ విచారించిన ఏపీ హైకోర్టు.. అరెస్ట్ చేయకుండా ముందస్తు ఉత్తర్వులు ఇచ్చేందుకు నిరాకరించింది.

## ప్రముఖ సింగర్‌ను టార్గెట్ చేసిన లారెన్స్ బిష్ణోయ్ ముఠా,,,



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 17,** భారతీయ సంగీత ప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న గాయకుడు బి ప్రాక్ ఇప్పుడు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ హిట్ లిస్ట్‌లోకి చేరారు. సల్మాన్ ఖాన్ వంటి దిగ్గజాలనే టార్గెట్ చేసిన ఈ ప్రమాదకరమైన ముఠా.. ఇప్పుడు బి ప్రాక్‌ను ఏకంగా రూ.10 కోట్ల రూపాయలు డిమాండ్ చేస్తూ ప్రాణాపాయం ఉందని బెదిరించింది. ఈ మేరకు మొహాలీ పోలీసులకు ఫిర్యాదు అందడంతో పంజాబ్ పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు.

బెదిరింపు కాల్ వెనుక ఉన్నది ఎవరు..?

పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల ప్రారంభంలో జనవరి 5వ తేదీన బి ప్రాక్ సన్నిహితుడు, సహ గాయకుడు అయిన దిల్నూర్‌కు విదేశీ నంబర్ నుంచి ఫోన్ కాల్స్ వచ్చాయి. ఆ సమయంలో దిల్నూర్ స్పందించకపోవడంతో.. మరుసటి రోజు ఒక వాయిస్ మెసేజ్ పంపారు. అందులో అవతలి వ్యక్తి తనను తాను లారెన్స్ బిష్ణోయ్ అనుచరుడిగా (అర్జు బిష్ణోయ్ లేదా అన్మోల్ బిష్ణోయ్ అని భావిస్తున్నారు) పరిచయం చేసుకున్నాడు.

'ఈ సమాచారాన్ని బి ప్రాక్‌కు చేరవేయి. మాకు వారం రోజుల్లో రూ.10 కోట్లు అందాలి. అతను ఏ దేశానికి వెళ్లినా సరే. మా కన్ను అతడిపై ఉంటుంది. డబ్బు అందకుంటే బి ప్రాక్‌ను మట్టిలో కప్పెడతాం.. అతడిని బూడిద చేస్తాం" అని చెప్పారు. ఈ ఆడియో క్లిప్పింగ్‌ను ఆధారంగా చేసుకుని దిల్నూర్ మొహాలీ ఎస్ఎస్పీకి రాతపూర్వక ఫిర్యాదు చేశారు. గతంలో సిద్ధూ మూసేవాలా హత్య, గతేడాది ఏపీ ధిల్లాన్ ఇంటి వద్ద కాల్పులు వంటి ఘటనల నేపథ్యంలో పోలీసులు ఈ బెదిరింపును అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నారు. బి ప్రాక్ ఇంటి వద్ద, ఆయన ప్రయాణించే మార్గాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. అలాగే ఈ ఫోన్ కాల్స్ ఏ దేశం నుండి వచ్చాయి? దీని వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరు? అనే కోణంలో సైబర్ క్రైమ్ విభాగం ఆరా తీస్తోంది.

'తేరీ మిట్టీ", "ఫిల్‌హాలు, "మన్ భర్యా" వంటి అద్భుతమైన గీతాలతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న బి ప్రాక్‌కు ఇలాంటి అనుభవం ఎదురవ్వడం పంజాబీ, బాలీవుడ్ మ్యూజిక్ ఇండస్ట్రీలో భయాందోళనలకు దారితీసింది. వరుసగా సెలబ్రిటీలను టార్గెట్ చేస్తూ.. బిష్ణోయ్ గ్యాంగ్ సృష్టిస్తున్న ఈ అలజడికి అడ్డుకట్ట వేయాలని సినీ ప్రముఖులు డిమాండ్ చేస్తున్నారు.

## "“నా ఇల్లు కూల్చిన వారికి తగిన శాస్తి జరిగింది':



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 17** దేశంలోనే అత్యంత సంపన్న మున్సిపల్ కార్పొరేషన్ అయిన బృహన్ముంబయి ఎన్నికల ఫలితాలు మహారాష్ట్ర రాజకీయాల్లో కొత్త శకాన్ని ఆవిష్కరించాయి. ఈ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘనవిజయం సాధించి.. దశాబ్దాల శివసేన ఆధిపత్యానికి తెరదించింది. ఈ చారిత్రాత్మక విజయంపై బీజేపీ ఎంపీ, నటి కంగనా రనౌత్ స్పందిస్తూ.. ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివసేనపై విమర్శల జడివాన కురిపించారు. దీనిని తనపై జరిగిన దాడికి లభించిన న్యాయంగా ఆమె అభివర్ణించారు.


"ప్రజలే వారికి సరైన చోటు చూపించారు"

బీఎంసీ ఫలితాల అనంతరం కంగనా రనౌత్ మీడియాతో మాట్లాడుతూ ఉద్వేగానికి లోనయ్యారు. "మహారాష్ట్రలో బీజేపీ సాధించిన ఈ అద్భుతమైన విజయం పట్ల నేను చాలా సంతోషంగా ఉన్నాను. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ నాయకత్వంలో రాష్ట్రమంతా కాషాయమయమైంది. ఇది మనందరి విజయం" అని ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా 2020లో తన కార్యాలయాన్ని బీఎంసీ అధికారులు కూల్చివేసిన ఉదంతాన్ని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. "నాడు నన్ను దూషించి, నా ఇంటిని కూల్చివేసి, మహారాష్ట్ర విడిచి వెళ్లాలని బెదిరించిన వారిని.. ఈ రోజు మహారాష్ట్ర ప్రజలే రాష్ట్రం నుంచి వెలేశారు. మహిళలపై ద్వేషం చిమ్మే వారు, బంధుప్రీతి మాఫియాకు జనం సరైన చోటు చూపించినందుకు నాకు గర్వంగా ఉంది" అని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు.

మొత్తం 227 సీట్లలో వెలువడిన ట్రెండ్స్ ప్రకారం ముంబై గడ్డపై బీజేపీ స్పష్టమైన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. బీజేపీ 90 స్థానాల్లో ఆధిక్యం సాధించి అతిపెద్ద పార్టీగా అవతరించింది. అలాగే ఏక్ నాథ్ షిండే శివసేన పార్టీ 28 వార్డుల్లో గెలుపు బాటలో ఉంది. ఉద్ధవ్ సేన కేవలం 57 స్థానాలకే పరిమితమైంది. ఇలా కాంగ్రెస్ 15 స్థానాల్లో, రాజ్ థాకరే 9 స్థానాల్లో ఆధిక్యంలో ఉన్నాయి. ఒంటరిగా పోటీ చేసిన అజిత్ పవార్ వర్గం కేవలం 3 సీట్లకే పరిమితమైంది.

కేవలం ముంబై మాత్రమే కాదు పుణె, పింప్రి-చించ్వాడ్ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు కూడా రాజకీయ విశ్లేషకులను ఆశ్చర్యానికి గురిచేశాయి. ఒకప్పుడు ఈ ప్రాంతాల్లో తిరుగులేని శక్తిగా ఉన్న 'పవార్ బ్రాండ్ణ ఇప్పుడు పనిచేయడం లేదని స్పష్టమైంది. శరద్ పవార్, అజిత్ పవార్ వర్గాలు లోపాయికారీ ఒప్పందాలు చేసుకున్నప్పటికీ.. ఓటర్లు మాత్రం అభివృద్ధి వైపే మొగ్గు చూపారు. కంగనా కార్యాలయం కూల్చివేతను నాడు బాంబే హైకోర్టు కేవలం చట్టపరమైన దురుద్దేశం అని కొట్టివేసింది. నేడు రాజకీయంగా కూడా ఆ పార్టీ పతనం కావడంతో.. కంగనా రనౌత్ తనపై జరిగిన దాడికి కాలమే సమాధానం చెప్పిందని సగర్వంగా ప్రకటించారు.

## గ్రీన్ కో సంస్థకు అభినందనలు తెలిపిన జయప్రకాశ్ నారాయణ



**క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 17** కాకినాడలో ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేసిన గ్రీన్ కో సంస్థపై లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ ప్రశంసల వర్షం కురిపించారు. గ్రీన్ కో సంస్థకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ ప్రాజెక్ట్ వివరాలను ఆయన ప్రస్తావిస్తూ, "1950 మెగావాట్ల ఎలక్ట్రోలైజర్ సామర్థ్యంతో, 1.5 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తి లక్ష్యంతో ఏర్పాటైన ఈ గ్రీన్ అమ్మోనియా ప్లాంట్.. భారతదేశ ఇంధన రంగ పరివర్తనలో, అధిక విలువైన రసాయనాల ఉత్పత్తిలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది" అని పేర్కొన్నారు. ఇంతటి ప్రతిష్ఠాత్మకమైన, భారీ ప్రాజెక్టులే దేశ ఆర్థిక వ్యవస్థను మార్చగలవని జయప్రకాశ్ నారాయణ అభిప్రాయపడ్డారు.

# ప్రభుత్వానికి డబ్బులు ఎక్కడ నుంచి వస్తాయి..?



క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 17, కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1వ తేదీన బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. ఆ రోజున కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ప్రతీ ఏడాది ఫిబ్రవరి 1న బడ్జెట్ ప్రవేశపెట్టడం అనేది గత కొన్నేళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. ఈ సారి ఫిబ్రవరి 1న ఆదివారం వచ్చినప్పటికీ సెంటిమెంట్‌ను కొనసాగిస్తూ ఆ రోజునే బడ్జెట్ విడుదల చేయాలని కేంద్రం భావించింది. దీంతో ఈ సారి బడ్జెట్‌లో ఎలాంటి ట్యాక్స్ మినహాయింపులు ఉంటాయనే దానిపై సామాన్యులతో పాటు వ్యాపార వర్గాలు ఎదురుచూస్తున్నాయి. ఈ క్రమంలో అసలు బడ్జెట్ అంటే ఏమిటి..? బడ్జెట్‌కు డబ్బులు ఎక్కడ నుంచి వస్తుంది..? ప్రభుత్వం దానిని ఎలా ఖర్చు చేస్తోంది..? అనే వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.

బడ్జెట్ అంటే ఏమిటి?

ప్రభుత్వ ఆదాయ వనరులు ఏంటి..? ప్రజల నుంచి సేకరించిన ప్రతి రూపాయి ఎక్కడ ఖర్చు చేస్తారు? ఏ రంగానికి ఎంత ఖర్చు చేస్తారు? ఏ పథకానికి ఎంత ఖర్చు చేస్తారు? అనేది ముందుగా వెల్లడించేదే బడ్జెట్. సింపుల్‌గా బడ్జెట్ అంటే ప్రభుత్వ ఆర్థిక నివేదిక కార్డుగా చెప్పవచ్చు. ఆదాయం, ఖర్చుకు సంబంధించిన పూర్తి వివరాలు బడ్జెట్ అందిస్తుంది.

ప్రభుత్వానికి డబ్బులు ఎక్కడి నుంచి వస్తాయి..?

ప్రభుత్వానికి ఆదాయం రుణాలు, అప్పుల నుంచి వస్తాయి. గత సంవత్సరం ప్రభుత్వ డేటా ప్రకారం ప్రభుత్వం పొందే ప్రతీ రూపాయికి 24 పైసలు లోన్, ఇతర అప్పుల నుంచి వచ్చాయి. ఇక 22 పైసలు ఇన్‌కమ్ ట్యాక్స్‌ల నుంచి వచ్చాయి. ఇక 18 పైసలు జీఎస్టీ, ఇతర పన్నుల నుండి వస్తాయి. కార్పొరేషన్ పన్నుల నుంచి 17 పైసలు వచ్చాయి. డివిడెంట్లు, వడ్డీ, జరిమానాల నుంచి 9 పైసలు, ఇతర వనుల నుంచి 10 పైసలు వచ్చాయి. ట్యాక్స్‌లు, జీఎస్టీ, ప్రభుత్వ సంస్థల నుంచి డివిడెండ్లు, వడ్డీ ఆదాయం, రుసుములు, జరిమానాల నుంచి ప్రభుత్వానికి ఆదాయం లభిస్తాయి.

డబ్బులు ఎలా ఖర్చు చేస్తారు..?

రాష్ట్రాలకు సుంకాలు, పన్నులు చెల్లించడానికి ఖర్చు చేస్తుంది. ఇక దేశంలోని ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులకు ఖర్చు చేస్తుంది. ఇక వడ్డీ చెల్లింపులు, రక్షణ, పెన్షన్, ఇతర ఖర్చులకు ఉపయోగిస్తుంది. ఉదాహరణకు ఒక రూపాయి ఖర్చు చేస్తుందని అనుకుంటే రాష్ట్రాలకు పన్నులు, సుంకాల రూపంలో 22 పైసలు చెల్లిస్తుంది. ఇక రుణాలకు వడ్డీ చెల్లించడానికి 20 పైసలు, కేంద్ర ప్రభుత్వ పథకాలకు 16 పైసలు, రక్షణ కోసం 8 పైసలు, పెన్షన్ కోసం 4 పైసలు, ఇతర ఖర్చుల కోసం 30 పైసలు ఖర్చు చేస్తుంది

# గ్రామాల్లో ఆగని టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య ఘర్షణలు



క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 17, కాకినాడ జిల్లా కోటనందూరు మండలం అల్లిపూడి గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గ్రామంలోని టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకోవడంతో, ఇరు వర్గాలు కత్తులతో దాడి చేసుకున్నాయి. ఈ దాడిలో టీడీపీ కార్యకర్త బంగారయ్య మృతి చెందాడు. మరో ఇద్దరు టీడీపీ కార్యకర్తలు దుర్గా ప్రసాద్, శ్రీరామమూర్తి తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం వీరిద్దరూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వైసీపీ కార్యకర్తలు నారాయణమూర్తి, సతీశ్ లకు కూడా తీవ్ర గాయాలు కావడంతో... వీరిని కూడా ఆసుపత్రికి తరలించారు. ఘర్షణ వివరాల్లోకి వెళితే... టీడీపీ కార్యకర్తలు ఒక పుట్టినరోజు వేడుకకు వెళ్లి వస్తుండగా వారికి వైసీపీ కార్యకర్తలు ఎదురుపడ్డారు. ఈ క్రమంలో ఘర్షణ చోటుచేసుకుంది. పాత గొడవలే దీనికి కారణమని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘర్షణపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు, గ్రామంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు.

# మగవాళ్లకు ఫ్రీ బస్ స్కీమ్.. ఆడవారికి నెలకు రూ.2వేలు

క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 17,గత కొన్నేళ్లుగా ఎన్నికలు అనగానే ఫ్రీ బస్ స్కీమ్ ముందు వరుసలో ఉంటుంది. కర్ణాటక మొదలుకొని, తెలంగాణ, ఏపీలో ఫ్రీ బస్ స్కీమ్ అవుతుంది. ప్రస్తుతం తమిళనాడులో ఎన్నికల వేడి రాజుకుంది. ఈ క్రమంలో పార్టీలన్నీ ప్రజలను ఆకట్టుకునేందుకు వ్యూహ ప్రతివ్యూహాలు రచిస్తున్నాయి. అటు అన్నాడీఎంకే తన దూకుడును పెంచింది. ఎంజీఆర్ జయంతి సందర్భంగా చెన్నైలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఎంజీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం.. పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి సంచలన ప్రకటనలు చేశారు. డీఎంకే ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూనే తాము అధికారంలోకి వస్తే అమలు చేయబోయే సంక్షేమ పథకాలను వివరించారు.

ప్రధాన ఎన్నికల హామీలు ఇవే

మహిళలకు నెలకు రూ. 2వేలు

సమాజంలో ఆర్థిక సమతుల్యత సాధించడమే లక్ష్యంగా రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబంలోని మహిళా యజమానికి నెలకు రూ. 2,000 నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించారు. ప్రస్తుత డీఎంకే ప్రభుత్వం ఇస్తున్న రూ. 1,000 కంటే ఇది రెట్టింపు కావడం గమనార్హం.

రవాణా రంగంలో విప్లవం

మహిళలకు ప్రస్తుతం ఉన్న ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కొనసాగిస్తూనే..పురుషులకు కూడా ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని ప్రారంభిస్తామని ఎడప్పాడి హామీ ఇచ్చారు.

అమ్మ ఇల్లం పథకం

గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లు లేని పేదలకు ప్రభుత్వం భూమిని కొనుగోలు చేసి, ఇళ్లను నిర్మించి ఇస్తుంది. పట్టణ ప్రాంతాల్లో స్థలం కేటాయించి, ఆధునిక అపార్ట్‌మెంట్లను నిర్మిస్తారు. షెడ్యూల్డ్ కులాల కుటుంబాల్లోని మహిళలు వివాహం చేసుకున్న సమయంలో వారికి కాంక్రీట్ ఇళ్లను కానుకగా నిర్మించి ఇస్తామని పళనిస్వామి హామీ ఇచ్చారు.



ఉపాధి హామీ పెంపు

గ్రామీణ కూలీల సంక్షేమం కోసం 100 రోజుల ఉపాధి హామీ పథకాన్ని 150 రోజులకు పెంచుతామని హామీ ఇచ్చారు.

అమ్మ ద్విచక్ర వాహన పథకం

మహిళల ఆర్థిక స్వావలంబన కోసం 5 లక్షల మంది మహిళలకు రూ. 25,000 సబ్సిడీతో ద్విచక్ర వాహనాలను అందజేస్తామని వెల్లడించారు.

త్వరలోనే పూర్తిస్థాయి మేనిఫెస్టో

పార్టీ మేనిఫెస్టో తయారీ బృందం ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి ప్రజల అభిప్రాయాలను సేకరించిందని, ఈ నివేదికల ఆధారంగా మరిన్ని కీలక ప్రకటనలతో కూడిన పూర్తిస్థాయి మేనిఫెస్టోను త్వరలోనే విడుదల చేస్తామని పళనిస్వామి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎడప్పాడి మాట్లాడుతూ.. స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వానికి పరిపాలనా నైపుణ్యం లేదని విమర్శించారు. డీఎంకే పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయింది. నిపుణుల కమిటీలు వేసినా అప్పులు తగ్గలేదు.. ఈ ఐదేళ్ల కాలం ముగిసేసరికి తమిళనాడుపై సుమారు రూ. 5.5 లక్షల కోట్ల అదనపు అప్పు భారం పడింది" అని ఆయన ధ్వజమెత్తారు.


# సగానికి తగ్గనున్న ప్రయాణ సమయం,,,, భారత్‌లోనే అతి పొడవైన ఎక్స్‌ప్రెస్‌వే



క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 17, దేశంలోనే అత్యంత పొడవైన గంగా ఎక్స్‌ప్రెస్‌వే ప్రారంభానికి రంగం సిద్ధమైంది. ఉత్తర్‌ప్రదేశ్ ఎక్స్‌ప్రెస్‌వేస్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అథారిటీ (యూపీఈఐడీఏ) వెల్లడించిన సమాచారం ప్రకారం.. ఫిబ్రవరిలో ఈ ఎక్స్‌ప్రెస్‌వే ప్రజలకు అందుబాటులోకి రానుంది. 594 కిలోమీటర్ల పొడవున్న ఈ ప్రాజెక్టు.. ప్రస్తుతం భారతదేశంలోనే అత్యంత పొడవైన ఎక్స్‌ప్రెస్‌వేగా నిలవనుంది. ఈ ఎక్స్‌ప్రెస్‌వే పశ్చిమ ఉత్తర్‌ప్రదేశ్‌లోని మీరట్ (బిజౌలీ గ్రామం) నుంచి తూర్పున ఉన్న ప్రయాగ్‌రాజ్ (జుడాపూర్ దండు గ్రామం) వరకు సాగుతుంది. ఇది మొత్తం 12 జిల్లాలను కలుపుతూ నిర్మిస్తున్నారు.

మీరట్, హాపూర్, బులంద్‌షహర్, అమ్రోహా, సంభల్, బదౌన్, షాజహాన్‌పూర్, హర్దోయ్, ఉన్నావ్, రాయ్‌బరేలి, ప్రతాప్‌గఢ్, ప్రయాగ్‌రాజ్ జిల్లాలను కలుపుతూ ఈ గంగా ఎక్స్‌ప్రెస్‌వే నిర్మించారు. ప్రస్తుతం మీరట్ నుంచి ప్రయాగ్‌రాజ్ చేరుకోవడానికి సాధారణంగా 12 గంటల నుంచి 13 గంటల సమయం పడుతుంది. గంగా ఎక్స్‌ప్రెస్‌వే అందుబాటులోకి వస్తే.. ఈ సమయం కేవలం 6 గంటల నుంచి 8 గంటలకు తగ్గిపోతుంది. దీనివల్ల ఇంధనం ఆదా అవ్వడమే కాకుండా రవాణా వేగవంతం అవుతుంది.ఇటీవల బదౌన్ జిల్లాలో నిర్వహించిన టోల్ ప్లాజా ట్రయల్ రన్ సక్సెస్ అయింది. వాహనాలు టోల్ గేట్ల వద్ద ఆగకుండానే ఫాస్ట్‌ట్యాగ్ ద్వారా ఆటోమేటిక్‌గా గేట్లు తెరుచుకునే విధానాన్ని పరీక్షించారు. ఇది ట్రాఫిక్ రద్దీని తగ్గించి.. వాహనదారులు ఎలాంటి అంతరాయం లేకుండా ప్రయాణించడానికి సహాయపడుతుంది. ఈ గంగా ఎక్స్‌ప్రెస్‌వే నాణ్యతను పెంచడానికి స్విట్జర్లాండ్‌కు చెందిన 'ఈటీహెచ్ జ్యూరిచ్ యూనివర్సిటీ', 'ఆర్‌టీడీటీ లేబొరేటరీస్‌ భాగస్వామ్యంతో సరికొత్త టెక్నాలజీని ఉపయోగిస్తున్నారు.రోడ్డుపై ఉండే కుదుపులు, సౌకర్యాన్ని కొలవడానికి 7 సెన్సార్లు కలిగిన ప్రత్యేక వాహనంతో తనిఖీలు చేస్తున్నారు. రోడ్డు నిర్మాణం జరుగుతున్నప్పుడే ఎక్కడైనా లోపాలు ఉంటే ఈ సెన్సార్లు వెంటనే గుర్తిస్తాయి. తద్వారా వాటిని వెనువెంటనే సరిదిద్దే అవకాశం ఉంటుంది. ఈ గంగా ఎక్స్‌ప్రెస్‌వే 140 నదులు, జలవనరులను దాటుతుంది. ఈ ప్రాజెక్టులో 14 మేజర్ పెద్ద వంతెనలు.. 126 మైనర్ చిన్న వంతెనలు ఉన్నాయి. 28 ఫ్లై ఓవర్లు, 50 వెహికల్ అండర్‌పాస్‌లు ఉన్నాయి. అత్యవసర సమయాల్లో యుద్ధ విమానాల ల్యాండింగ్ కోసం షాజహాన్‌పూర్‌లో 3.5 కిలోమీటర్ల పొడవైన రన్‌వేను నిర్మించారు.

# అదనపు పోలీసుస్టేషన్ ఏదీ?



క్రైం కౌంటర్ న్యూస్, బొబ్బిలి జనవరి 17: బొబ్బిలిలో ప్రజావసరాలకు తగ్గట్టుగా మరో పోలీసు స్టేషన్‌ను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన కదలిక లేకుండా పోయింది. జిల్లాలో కొత్తగా విజయనగరంలో ఒకటి, భోగాపురంలో ఒకటి కొత్త పోలీసుస్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో బొబ్బిలిలో కూడా కొత్తగా ఏర్పాటు ఆవశ్యకతను గుర్తించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.బొబ్బిలి పట్టణంలో 31 మున్సిపల్ వార్డు లు, మండలంలో 30 గ్రామపంచాయతీలు ఉన్నాయి. సుమారు లక్షన్నర జనాభా ఉన్నారు. పట్టణానికి, మండలానికి ఒక్కటే పోలీసు స్టేష న్ ఉండడంతో ఇబ్బందిగా ఉంటోది. పరిధి ఎక్కువగా ఉండడంతో శాంతిభద్రతల పర్యవేక్షణ, రోడ్డు ప్రమాదాల నివారణ, ఫ్యామిలీ కౌన్సిలింగ్, ఫిర్యాదుదారుల నుంచే వచ్చే కేసుల విచారణ, పరిష్కారం తదితర వాటి విషయమై పోలీసులపై విపరీతమైన భారం ఉంటోంది. దీనికి తోడుగా పోలీసు సిబ్బంది కొరత పట్టిపీడిస్తోంది.

బొబ్బిలిలో రెండు పోలీసు సర్కిల్ కార్యాలయాలున్నాయి. బొబ్బిలి పట్టణం, మండలానికి కలిపి ఒకటి ఉండగా, బొబ్బిలి నియోజకవర్గ పరిధిలోని రామభద్రపురం, బాడంగి, తెర్లాం మండలాలకు కలిపి ఒకటి ఉంది. బొబ్బిలి రూరల్ సర్కిల్ కార్యాలయం పరిధిలో బొబ్బిలి రూరల్ మండలం లేదు. అందుకోసమని గతంలో ఈ రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని నేషనల్ హైవే ఉన్న రామభద్రపురం కేంద్రానికి మార్చాలన్న ప్రతిపాదన కూడా తెరమీదకి వచ్చింది.

బొబ్బిలిలో ట్రాఫిక్ పోలీసుస్టేషన్ లేదా మహిళా పోలీసుస్టేషన్, రూరల్ పోలీసుస్టేషన్ ఏర్పాటు చేయాలని చాలా ఏళ్ల నుంచి ప్రజాప్ర తినిధులు, అన్ని వర్గాల ప్రజలు కోరుతూనే ఉన్నారు. బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన అసెంబ్లీలో కూడా ప్రస్తావించారు. హోమ్ మంత్రికి, పోలీసు ఉన్నతాధికారులకు అదనపు స్టేషన్ ఆవశ్యకతను వివరించారు. నిధుల కొరత కారణంగా ప్రభుత్వం నుంచి విధానపర మైన నిర్ణయం వెలువడడం లేదని అధికారిక వర్గాలు చెబుతున్నాయి.

ప్రస్తుతం బొబ్బిలి ఎస్‌హెచ్‌వో పరిధిలో పట్టణం, మండలానికి కలిపి 70 మంది పోలీసు సిబ్బంది అవసరం ఉండగా సగం మంది కూడా లేరు. కోర్టు తదితర విధుల కోసం ఒకరు, రిసెప్షన్‌లో ఒకరు, సమన్లు అందజేయడానికి ఒకరు.. ఇలా కొన్ని విధిలుకు శాశ్వతంగా కొందరు ఉండాలి. రోడ్డు ప్రమాదాలు తరచూ జరుగుతాయి వాటి ఎంఎల్‌సీ కేసులు, శవపంచాయితీ, పోస్టుమార్టమ్ తదితర వాటికోసం కనీసం ముగ్గురు ఉండాలి. ఫ్యామిలీ కౌన్సిలింగ్, ఫిర్యాదులపై విచారణ, చోరీ కేసులు ఛేధించడం కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లడం వంటి విధులు తీరికలేకుండా ఉంటాయి. ఇదే సమయంలో అత్యవసరంగా సెలవులు పెట్టేవారుంటారు. గత ఏడాది జూలై 8 న బొబ్బిలిలో పర్యటించిన హోమ్‌మంత్రి వంగలపూడి అనిత దృష్టికి అదనపు పోలీసుస్టేషన్ విషయం తెచ్చినప్పుడు ఆమె సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యే బేబీనాయన ఎప్పుడు కలిసినా ఈ స్టేషన్ గురించి అడుగుతున్నారని, కచ్చితంగా దీనిపై ఆలోచన చేస్తామని హామీ ఇచ్చారు. రానున్న బడ్జెట్‌లోనైనా కొత్త స్టేషన్ ఏర్పాటుకు అవకాశాలుంటాయా? అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

# మనస్తాపంతో పిల్లల్ని చంపి ఆత్మహత్య చేసుకున్న మహిళ

క్రైం కౌంటర్ న్యూస్ జనవరి 17,నంద్యాలలో విషాదం చోటుచేసుకుంది. భర్తతో గొడవపడిన ఓ మహిళ ఇద్దరు పిల్లలను చంపి ఆత్మహత్యకు పాల్పడింది. ఎన్జీవో కాలనీలో ఈ విషాదకర సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..నంద్యాలలోని లలితా నగర్ కు చెందిన ఉదయ్ కిరణ్ కు, ఎన్జీవో కాలనీకి చెందిన మల్లికకు ఏడేళ్ల కిందట వివాహం జరిగింది. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు ఇషాన్ సాయి(2), పరిమిత(7 నెలలు) ఉన్నారు. కొంతకాలంగా ఉదయ్, మల్లికల మధ్య గొడవలు జరుగుతున్నాయి. నిన్న (శుక్రవారం) రాత్రి కూడా గొడవ జరగడంతో మనస్థాపం చెందిన మల్లిక పిల్లలను తీసుకుని గదిలోకి వెళ్లి తలుపులు బిగించుకుంది.ఏడుస్తూ పడుకుని ఉంటుందని ఉదయ్ కిరణ్ పట్టించుకోలేదు. తెల్లవారినా తలుపులు తెరవకపోవడంతో గది తలుపులు బద్దలు కొట్టి చూడగా.. మల్లికతో పాటు పిల్లలు ఇద్దరూ విగత జీవులుగా పడి ఉన్నారు. పిల్లలను చంపి మల్లిక ఉరి వేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. మల్లిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ఉదయ్ కిరణ్ ను విచారిస్తున్నట్లు సమాచారం.

# సినిమా



## ఆస్తులన్నీ పోగొట్టుకున్నా..

ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్ తన జీవితంలోని ఆటుపోట్ల గురించి, ముఖ్యంగా ఆర్థిక సమస్యల సమయంలో ఎదుర్కొన్న అనుభవాల గురించి చాలా సందర్భాల్లో బయటపెట్టారు. జీవితంలో ఎన్నో ఆస్తులు సంపాదించి, కోల్పోయిన రోజులను ఆయన గుర్తుచేసుకున్నారు. ఒకానొక దశలో తన దగ్గర ఏమీ లేవని, లక్ష కూడా లేదని వెల్లడించారు. అలాంటి క్లిష్ట సమయంలో తాను చాలా సైలెంట్‌గా, ఒక రకంగా "హ్యాపీగా" ఫీల్ అయ్యానని, ఎందుకంటే తన చుట్టూ ఎవరూ లేరని అన్నారు. అయితే, బాధ ఉన్నా, సున్నా నుంచి మళ్లీ పని చేసుకోవాలనే స్ఫూర్తి కూడా కలిగిందని చెప్పారు. ఆర్థికంగా కష్టాల్లో ఉన్నప్పుడు తనకు అండగా నిలిచిన వ్యక్తి తన భార్య మాత్రమేనని పూరి జగన్నాథ్ స్పష్టం చేశారు. చిత్ర పరిశ్రమ నుంచి ఎలాంటి మద్దతు లభించలేదని, బ్లాక్‌బస్టర్‌లు ఇచ్చి ఎంతో మంది హీరోలను, నిర్మాతలను ఉన్నత స్థాయికి చేర్చినా, ఎవరూ తిరిగి తనను పట్టించుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం నీతి వాక్యాలు మాట్లాడతారే తప్ప, కష్టాల్లో నిలబడేవారు ఎవరూ ఉండరని అన్నారు. ఒకానొక సందర్భంలో రామ్ గోపాల్ వర్మ తన బిజినెస్‌మాన్ సినిమా కథ ఆలోచనతో సహాయపడ్డారని పూరి జగన్నాథ్ తెలిపారు.

తన కెరీర్‌లో ఎన్నో ఆస్తులు సంపాదించానని, కానీ వాటిని కోల్పోయి, జేబులో లక్ష రూపాయలు కూడా లేని దశను చూశానని వెల్లడించారు. అలాంటి అత్యంత క్లిష్టమైన ఆర్థిక పరిస్థితుల్లో తన ఆలోచనా తీరు ఎలా ఉందో వివరించారు. తాను చాలా సైలెంట్‌గా, ఒక రకంగా సంతోషంగానే ఉన్నానని, ఎందుకంటే ఆ సమయంలో తన చుట్టూ ఎవరూ ఉండరని, ఎవరూ తనను ఇబ్బంది పెట్టరని అన్నారు. అయితే, ఒక వైపు బాధ ఉన్నప్పటికీ, మళ్లీ సున్నా నుంచి పని చేసుకోవాలని, కొత్తగా స్టార్ట్ చేయాలనే దృఢ సంకల్పం తనకు కలిగిందని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో తనకు బాసటగా నిలిచి, "నువ్వు చేయగలవు" అని ధైర్యం చెప్పిన ఏకైక వ్యక్తి తన భార్య మాత్రమేనని పూరి జగన్నాథ్ చెప్పారు. తన కష్టకాలంలో ఎవరూ వెనక్కి తిరిగి "పూరి ఎలా ఉన్నావ్?" అని అడగలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పరిశ్రమలో "ఎథిక్స్ గురించి మాట్లాడతారే తప్ప, కష్టాల్లో నిలబడేవారు ఎవరూ ఉండరని పూరి జగన్నాథ్ విమర్శించారు. ఆయనకు సహాయం చేయమని తాను కోరడం లేదని, కానీ ఇది సాధారణంగా పరిశ్రమలో ఉండే పరిస్థితి అని తెలిపారు. ఒకానొక సమయంలో వర్మ తనకు సహాయం చేశారని, బిజినెస్‌మాన్ సినిమా కథ ఆలోచనను ఇచ్చారని పూరి జగన్నాథ్ గుర్తుచేసుకున్నారు. వర్మ తనకొకసారి ఫోన్ చేసి, ముంబైలో ఇప్పుడు డాన్ ఎవరూ లేరని, ఎవరైనా వచ్చి డాన్ అవ్వొచ్చని, దీని మీద కథ రాస్తావా అని అడిగారని, ఆ ఐడియాతోనే తాను బిజినెస్‌మాన్ సినిమాను రాశానని వివరించారు.





## చలికాలంలో పెరుగు తింటున్నారా..

పెరుగు.. ప్రతి భారతీయుడి భోజనంలో ముఖ్యమైన, ఉపయోగకరమైన ఆహారం. దాని శీతలీకరణ లక్షణాలు, జీర్ణక్రియకు ప్రయోజనకరమైన ప్రోబయోటిక్స్, శరీరానికి శక్తిని అందించే సామర్థ్యం కారణంగా దీనిని 'సూపర్ ఫుడ్'గా పరిగణిస్తారు. అయితే, చాలా మంది శీతాకాలంలో పెరుగును దూరం పెడుతుంటారు. పెరుగు చల్లగా ఉంటుంది.. కాబట్టి, దీనిని తినడం వల్ల జలుబు, దగ్గు వంటి సమస్యలు కలిగిస్తుందని నమ్ముతారు. కానీ, శీతాకాలంలో పెరుగు తినడం నిజంగా ఆరోగ్యానికి హానికరమా..? అది మిమ్మల్ని అనారోగ్యానికి గురి చేస్తుందా..? నిపుణులు చెబుతున్న అసలు వాస్తవం ఏంటో ఇక్కడ చూద్దారా

పెరుగు తినడం వల్ల కలిగే ప్రయోజనాలు:

పెరుగులో ప్రోటీన్, కాల్షియం, భాస్వరం, జింక్, విటమిన్లు డీ2, డీ12 ఉంటాయి. పెరుగు మంచి బ్యాక్టీరియాను కలిగి ఉంటుంది. ఇది శరీరానికి చేరిన తర్వాత ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి సహాయపడుతుంది. పెరుగు తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. ఇందులో విటమిన్లు ఉంటాయి. ఇవి రోగనిరోధక వ్యవస్థతో పాటు జుట్టు, చర్మాన్ని కూడా అందంగా చేస్తాయి. పెరుగు తినడం కడుపును చల్లగా ఉంచుతుంది. జీర్ణవ్యవస్థ బాగా పనిచేస్తుంది. ఇది చాలా తేలికగా ఉంటుంది. ఇది జీర్ణం కావడానికి సులభం. పెరుగు తినడం వల్ల ఎముకలు, దంతాలు బలపడతాయి. ఇందులో కాల్షియం కూడా ఎక్కువగా ఉంటుంది. అయితే, చలికాలంలో పెరుగు తినాలా వద్దా?:

పెరుగు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుందని పోషకాహార నిపుణులు అంటున్నారు. దీన్ని తినడం వల్ల శరీరానికి చాలా ప్రయోజనాలు ఉన్నాయి. కాబట్టి, మీరు దీన్ని ఎప్పుడైనా తినవచ్చు. శీతాకాలం, వేసవి కాలం సీజన్ ఏదైనా సరేపెరుగు హానికరం కాదు. కానీ, మీరు పెరుగు తినడానికి సరైన సమయం తెలుసుకోవాలి. ప దీనికి సరైన సమయం లంచ్ టైమ్. రాత్రిపూట పెరుగు తినడం హానికరం. పెరుగు చల్లగా ఉంటుంది. కాబట్టి, రాత్రిపూట తినడం వల్ల జలుబు, దగ్గు సమస్య వేదించే అవకాశం ఉంది. పెరుగు తిన్న వెంటనే నీళ్లు తాగకూడదు. కనీసం ఐదు నుంచి 10 నిమిషాలు గ్యాప్ తర్వాత తీసుకోండి. మీకు ఇప్పటికే జలుబు, దగ్గు ఉంటే పెరుగు తినడం మానుకోండి.


పెరుగు ఇతర ఆరోగ్య ప్రయోజనాలు:

పెరుగులోని ప్రోబయోటిక్స్ మీ ప్రేగులోని బ్యాక్టీరియాను సమతుల్యం చేస్తాయి. ఆహారం ఎక్కువగా తిన్న తర్వాత పెరుగు తినటం వల్ల ప్రత్యేకంగా సహాయపడుతుంది. రాత్రి సమయంలో మీ జీవక్రియ రేటు నెమ్మదిస్తుంది. కాబట్టి, పెరుగు మీ జీర్ణక్రియను సజావుగా ఉంచడంలో సహాయపడుతుంది. ఆమ్లత్వం, ఉబ్బరం, నిద్రలేమి సమస్యలను దూరం చేస్తుంది.

పెరుగులో ప్రోటీన్ అధికంగా ఉంటుంది. కేలరీలు తక్కువగా ఉంటాయి. ఇది మిమ్మల్ని ఎక్కువసేపు కడుపు నిండి ఉండేలా చేస్తుంది. బరువును నియంత్రించుకోవడానికి ప్రయత్నించే వారికి పెరుగు సరైన ఎంపిక అవుతుంది.

పెరుగు రోగనిరోధక వ్యవస్థకు పునాది వేస్తుంది. రాత్రిపూట పెరుగు తినడం వల్ల మీ శరీరం విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు మంచి బ్యాక్టీరియా నిరంతరం సరఫరా అవుతుంది. ఇది డీటాక్స్‌కు సహాయపడుతుంది. మరుసటి రోజుకు మిమ్మల్ని బాగా సిద్ధం చేస్తుంది.

పెరుగు వంటి పులియబెట్టిన పాల ఉత్పత్తులు చర్మ ఆరోగ్యంతో బాగా ముడిపడి ఉంటాయి. పెరుగులోని పోషకాలు, యాంటీఆక్సిడెంట్లు రాత్రిపూట శరీరం సహజ పునరుత్పత్తి ప్రక్రియకు సహాయపడతాయి. అయితే, లాక్టిక్ ఆమ్లం విషాన్ని సున్నితంగా తొలగిస్తుంది. ఫలితంగా, చర్మ కణాలు లోపలి నుండి పోషణ పొందుతాయి. ఉదయం మీరు తాజాగా కనిపిస్తాయి.



## ప్లాస్టిక్ కోడి గుడ్లను ఎలా గుర్తించాలో తెలుసా?

ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు కలిగించే కోడి గుడ్లపై ఎప్పుడూ ఏదో ఒక రూమర్ వస్తూనే ఉంటుంది. గత కొద్ది రోజులుగా సోషల్ మీడియా వీడియోల్లో ప్లాస్టిక్ లేదా నకిలీ కోడి గుడ్ల గురించిన సందేహాలు వైరల్ అవుతున్నాయి. దీనికి సంబంధించిన భయం పెరుగుతున్న నేపథ్యంలో నకిలీ గుడ్లను అసలు గుడ్లతో ఎలా వేరు చేసుకోవచ్చో తెలుసుకోవడం ఇప్పుడు చాలా అవసరంగా మారింది.

నకిలీ గుడ్లు అంటే ఏమిటి?

"నకిలీ గుడ్లు" లేదా "ప్లాస్టిక్ గుడ్లు" అనేది రసాయనాలు లేదా రిజిన్ వంటి సరిపోయే పదార్థాలతో తయారుచేసిన కృతిమ ఉత్పత్తి. ఇవి నిజమైన ప్రధాన భాగం (యోల్క్/ వైట్) లేకుండా ఉండే అవకాశముంది. కానీ, మార్కెట్లో పెద్ద మొత్తంలో ఇవి కనిపించడం సాధారణంగా జరగదు. చాలా సందర్భాల్లో తక్కువ భద్రత లేదా నెమ్మదిగా పెస్ట్‌షెల్ఫ్ పొందిన గుడ్లు కూడా నకిలీగా అనిపిస్తాయి.

కోడి గుడ్డు పగల్చకుండా కింది కొన్ని పద్ధతుల ద్వారా అసలైనవి తెలుసుకోవచ్చు.

1. షేక్ టెస్ట్ గుడ్డును చెవికి దగ్గర పెట్టి నెమ్మదిగా షేక్ చేస్తే.. నిజమైన గుడ్డు.. రెండు భాగాల (యోల్క్ ఒ వైట్) మధ్య ఇది పెద్దగా శబ్దం ఇవ్వదు. ప్లాస్టిక్/నకిలీగా అనిపిస్తుంటే మీకు లోపలి ద్రవం "ప్లగు లాగా శబ్దం చేయవచ్చు.

2. షెల్ ఫీల్/టెక్స్చర్ పరిశీలన నిజమైన గుడ్డు షెల్ సాధారణంగా కొంచెం గరుకుగా ఉంటుంది. చాలా చాలా మెత్తగా, పాలిష్డ్, మండలు లాగ ఉన్నట్లుగా అయితే ఇది కృత్రిమంగా అనిపించవచ్చు.

## టీమిండియా 5 ఏళ్ల రికార్డు మటాష్ అవుతుందా?

భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య జరుగుతున్న వన్డే సిరీస్ ఇప్పుడు క్లైమాక్స్‌కు చేరుకుంది. రేపు (ఆదివారం, జనవరి 18) ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియంలో జరగబోయే మూడో వన్డే ఇరు జట్లకు చావో రేవో లాంటిది. వడోదరలో జరిగిన మొదటి మ్యాచ్‌లో టీమిండియా గెలవగా, రాజ్‌కోట్‌లో జరిగిన రెండో వన్డేలో కివీస్ పుంజుకుని సిరీస్‌ను 1-1తో సమం చేసింది. దీంతో రేపటి మ్యాచ్‌లో గెలిచిన వారే సిరీస్ విజేతలుగా నిలుస్తారు. మరి టీమిండియా తన కోటను కాపాడుకుంటుందా? లేక న్యూజిలాండ్ చరిత్ర సృష్టిస్తుందా? అన్నది ఉత్కంఠగా మారింది.

భారత జట్టుకు తన సొంత గడ్డపై తిరుగులేని రికార్డు ఉంది. మార్చి 2019 తర్వాత ఇప్పటివరకు టీమిండియా స్వదేశంలో ఒక్క వన్డే సిరీస్ కూడా ఓడిపోలేదు. అప్పట్లో ఆస్ట్రేలియాపై తలపడినప్పుడు మాత్రమే సిరీస్ కోల్పోయింది. అయితే ఇప్పుడు ఆ ఐదేళ్ల నాటి అజేయ రికార్డుకు ముప్పు పొంచి ఉంది. అటు న్యూజిలాండ్ జట్టుకు కూడా ఇది చారిత్రాత్మక అవకాశం. 1989 నుంచి కివీస్ జట్టు భారత్‌లో పర్యటిస్తున్నప్పటికీ, ఇక్కడ ఒక్క వన్డే సిరీస్ కూడా గెలవలేదు. ఒకవేళ రేపు గెలిస్తే, కివీస్ కెప్టెన్, జట్టు చరిత్ర పుటల్లోకి ఎక్కుతారు.

టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు ఇది అగ్నిపరీక్ష. ఆయన బాధ్యతలు చేపట్టిన తర్వాత భారత జట్టు కొన్ని చేదు జ్ఞాపకాలను చవిచూసింది. శ్రీలంకలో వన్డే సిరీస్ ఓడిపోవడం, స్వదేశంలో టెస్టు మ్యాచ్‌ల్లో పరాజయం పాలవ్వడం వంటివి గంభీర్ నాయకత్వంపై విమర్శలకు తావిచ్చాయి. రేపు గనుక సిరీస్ చేజారితే, గంభీర్ ఖాతాలో మరో అవాంఛిత రికార్డు చేరుతుంది. కాబట్టి కోచ్‌గా ఆయన రేపటి మ్యాచ్‌ను చాలా సీరియస్‌గా తీసుకుంటున్నారు.

రెండో వన్డేలో భారత్ ఓటమికి ప్రధాన కారణం న్యూజిలాండ్ బ్యాటర్ డారిల్ మిచెల్ సెంచరీ మాత్రమే కాదు, మధ్య ఓవర్లలో భారత స్పిన్నర్లను కివీస్ సమర్థవంతంగా ఎదుర్కోవడం. ముఖ్యంగా భారత బ్యాటర్లు కూడా స్పిన్ బౌలింగ్‌లో తడబడుతున్నారు. స్ట్రైక్ రొటేట్ చేయడంలో విఫలమవుతూ అనవసర ఒత్తిడికి గురవుతున్నారు. ఇండోర్ స్టేడియం బౌండరీలు చాలా చిన్నవి. ఇక్కడ బౌలర్లకు సహాయం చాలా తక్కువగా ఉంటుంది. కాబట్టి బ్యాటర్లు రెచ్చిపోవడం ఖాయం. ఇలాంటి పరిస్థితుల్లో స్పిన్నర్ల పాత్రే కీలకం కానుంది.

భారత బ్యాటింగ్ లైనప్ చాలా పటిష్టంగా ఉన్నప్పటికీ, ఫీల్డింగ్, బౌలింగ్‌లో చిన్న తప్పులు జరిగినా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. కివీస్ జట్టు అటాకింగ్ గేమ్ ఆడుతోంది. ఇరు జట్లూ సమ ఉజ్జీలుగా కనిపిస్తుండటంతో క్రికెట్ అభిమానులకు రేపు పసందైన వినోదం గ్యారెంటీ. భారత ఆటగాళ్లు ఒత్తిడిని అధిగమించి ఆడితేనే ఈ సిరీస్ మన సొంతమవుతుంది.

చెల్లించుకోక తప్పదు. కివీస్ జట్టు అటాకింగ్ గేమ్ ఆడుతోంది. ఇరు జట్లూ సమ ఉజ్జీలుగా కనిపిస్తుండటంతో క్రికెట్ అభిమానులకు రేపు పసందైన వినోదం గ్యారెంటీ. భారత ఆటగాళ్లు ఒత్తిడిని అధిగమించి ఆడితేనే ఈ సిరీస్ మన సొంతమవుతుంది.




## ఓవర్ యాక్షన్ చేస్తే ఊరుకుంటారా?

పాకిస్థాన్ క్రికెటర్లకు ఈ మధ్య కాలం అస్సలు కలిసి రావడం లేదు. ఆస్ట్రేలియాలో జరుగుతున్న బిగ్ బాష్ లీగ్ నుంచి బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ వరకు ఎక్కడ చూసినా పాక్ ఆటగాళ్లకు అవమానాలే ఎదురవుతున్నాయి. తాజాగా బంగ్లాదేశ్ లీగ్‌లో పాకిస్థాన్ ఓపెనర్ సాహిబ్జాదా ఫర్హాన్ చేసిన ఓ అత్యుత్సాహం ఇప్పుడు సోషల్ మీడియాలో నవ్వులపాలు చేస్తోంది. బౌలర్‌ను వెక్కిరించబోయి తనే బలికావడమే కాకుండా, ప్రత్యర్థి బౌలర్ చేతిలో ఘోరమైన అవమానాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది.

బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్‌లో రాజ్‌షాహి వారియర్స్ తరపున ఆడుతున్న సాహిబ్జాదా ఫర్హాన్, సిల్హెట్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో వింతగా ప్రవర్తించాడు. ఇన్నింగ్స్ నాలుగో ఓవర్‌లో బంగ్లాదేశ్ బౌలర్ రుయెల్ మియా వేసిన బంతిని ఫర్హాన్ డిఫెండ్ చేశాడు. బంతి బౌలర్ దగ్గరకు వెళ్లగానే, ఫర్హాన్ తన చేతిని ముఖం ముందుకు తెచ్చి హాలీవుడ్ రెజ్లర్ జాన్ సీనా స్టైల్లో యు కాంట్ సీ మీ అంటూ బౌలర్‌ను వెక్కిరించాడు. తనేదో తోపు బ్యాటర్ లాగా బౌలర్‌ను కించపరిచేలా ప్రవర్తించడం స్టేడియంలో ఉన్న వారందరినీ ఆశ్చర్యపరిచింది.

ఫర్హాన్ చేసిన ఈ వెటకారానికి రుయెల్ మియా సరైన సమాధానం ఇచ్చాడు. మరుసటి బంతికే ఫర్హాన్ భారీ షాట్ కొట్టబోయి షార్ట్ థర్డ్ మ్యాన్ ఫీల్డర్ కు క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. కేవలం 12 బంతుల్లో 14 పరుగులు చేసిన ఫర్హాన్, తల పట్టుకుని పెవిలియన్ వైపు నడిచాడు. అయితే ఇక్కడ అసలైన ట్విస్ట్ బౌలర్ సెలబ్రేషన్. వికెట్ తీసిన రుయెల్ మియా, దూకుడుగా ప్రవర్తించకుండా టీమిండియా స్పిన్నర్ యుజ్వేంద్ర చహల్ ఫేమస్ స్టైల్లో మైదానంలో పడుకుని వింతగా సెలబ్రేట్ చేసుకున్నాడు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది.

కేవలం ఫర్హాన్ మాత్రమే కాదు, ఇతర పాక్ స్టార్లు కూడా విదేశీ లీగ్ లలో విమర్శల పాలవుతున్నారు. బిగ్ బాష్ లీగ్‌లో షాహీన్ అఫ్రిదీ ఒకే ఓవర్‌లో రెండు బీమర్లు వేసి బౌలింగ్ నుంచి నిషేధానికి గురయ్యాడు. అటు మహ్మద్ రిజ్వాన్ నెమ్మదిగా ఆడుతున్నాడని కెప్టెన్ అతడిని రిటైర్డ్ అవుట్ చేయగా, బాబర్ ఆజంకు సింగిల్ ఇచ్చేందుకు స్టీవ్ స్మిత్ నిరాకరించడం పెద్ద దుమారం రేపింది. పాక్ ఆటగాళ్ల ప్రవర్తన, వారి ఆటతీరు చూస్తుంటే.. "తినడం, పడుకోవడం, అవమానపడటం.. మళ్ళీ రిపీట్ చేయడం" అన్నట్లుగా మారిపోయిందని నెటిజన్లు ట్రోల్ చేస్తున్నారు.



Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com